*రచన మాసపత్రిక(ఏప్రియల్, 1992)*

# మనోరమ

**కా**లేజీ విడిచారు.

'ఎవరు లిఫ్ట్ ఇస్తారా' అని అటూ ఇటూ చూసాడు సూరిబాబు. అప్పటికే అతని ఫ్రెండ్సంతా స్కూటరు సీట్లు పంచేసుకున్నట్టున్నారు.

ఎవర్దీ ఖాళీగా కనిపించలేదు.

ఇంక సిటీబస్సు తప్పదనుకుంటూ కాలేజీ బయటకు అడుగులు వేశాడు.

ఎవరో 'బాబూ' అని పిలవటం వినిపించి చటుక్కున ఆగిపోయాడు.

"నేనే పిలిచాను" అంటూ ఆమె దగ్గరగా వచ్చింది"

ఎవరో తెలియదు. ఎందుకు పిలిచిందా అనుకుంటూ ఆమెను తేరిపార చూసాడతను. గులాబిరంగు జార్జెట్ చీర - చక్కని ఆమె ఒంపుసొంపుల్ని దాచలేనంటోంది. ఆమె చీర రంగుతో పోటీపడుతున్న ఆమె పచ్చని వొళ్ళు తళుకులీనుతోంది. ఒత్తయిన జుట్టు, విశాలమైన కళ్ళు, సన్నని మెడ, ముచ్చటగా ముడుచుకున్న పెదవులు..... ఆమెకు పెట్టని సొమ్ములు!

తనకన్న ఏడెనిమిదేళ్ళు పెద్దదయివుంటుంది.... అనుకున్నాడు సూరిబాబు. ఇప్పుడిప్పుడే అతనిలో వయసుతో వచ్చే భావావేశం విచ్చుకుంటోంది. అందమయిన ఆడదాని సొగసుల్ని కళ్ళతో విందుచేసుకోమని చిందులేస్తోంది. మరీ అంత ఇదిగా చూడటం బావుండదని "ఏమిటండీ?" అన్నాడు.

"నాకో సాయం చేస్తావా బాబూ!"

ఆమె తనని అలా పిలవటం అతనికి నచ్చలేదు. ఆమె తనని పెద్దదాన్ని చేసుకుంటున్నందుక్కాదు..... తనని మరీ కుర్రవాడిగా చూస్తున్నందుకు! "నా పేరు బాబు కాదండి. సూరిబాబు" అన్నాడు.

ఆమె నవ్వింది. "అలాగా! అయితే సూరిబాబూ - అనే పిలుస్తాను. సరేనా!"

తలవూపి "మీకేదో సాయం కావాలన్నారు" అన్నాడు.

"కాలేజీలో పనివుండి వచ్చా. ఎందుకో వచ్చినప్పట్నించి తల తిరుగుతోంది. ఎక్కడయినా కళ్ళు తిరిగి పడిపోతానేమోనని భయం. శ్రమ కాకపోతే కొంచెం నన్ను మా ఇంటి దగ్గర దిగపెడతావా! ఆటోలో వెడదాం. డబ్బులు నేనే ఇస్తాను. కొంచెం తోడుకావాలి. అంతే!"

అందాల రాశి. సాయం కావాలంటోంది. అప్పుడే పరువం విచ్చుకుంటున్న వయస్సు.

కాదనగలడా! "అలాగే! మీ ఇల్లు ఎక్కడ?"

ఆమె చెప్పింది.

"సరే పదండి."

ఆమె రెండడుగులు వేసి తూలిపడబోయింది. గబుక్కున ఆమెను పొదివి పట్టుకొన్నాడతను. అతని భుజం మీద తలవాల్చుకొని "థేంక్యూ!" అంది ఆమె.

వింత అనుభూతితో అతని వొళ్ళు జల్లుమంది.

"సారీ, నీకు చాలా ట్రబుల్ ఇస్తున్నాను" అంది ఆమె.

"నో నో! నాటెటాల్...."

రోడ్డు మీదకి వచ్చారు. ఎక్కడా ఆటో కనిపించలేదు. కాసేపటికి అటువైపు ఖాళీ టాక్సీ వస్తుంటే ఆమె కేకవేసింది.

"టాక్సీలో వెడదామా?" అన్నాడు సూరిబాబు తెల్లబోతూ.

"అవును. ఇక్కడింక నిలబడలేను" అంటూ టాక్సీ డోరు తెరిచి వెనకసీట్లోకి వెళ్ళిపోయింది ఆమె. అతనికి సంజ్ఞ చేసింది. సూరిబాబు కూడా ఎక్కాడు.

తన చేతికి వచ్చిన నోట్లు గుప్పెడు తీసి సూరిబాబు చేతుల్లో పెడుతూ, "ఎంతవుతుందో చూసి నువ్వే ఇయ్యి" అంది.

ఏమనాలో తెలీక ఆ డబ్బు తీసుకుని జేబులో పెట్టుకున్నాడతను.

వెనక్కు చారగిలబడి "ఏం చదువుతున్నావు?" అంది.

"బిఎస్సి సెకండియర్!"

"గుడ్!" అంది కళ్ళు మూసుకుంటూ.

ఏదో అడగబోయాడు.

"కూర్చోలేకపోతున్నాను. వోమ్టింగ్ సెన్సేషన్‌గా వుంది. నీ కభ్యంతరం లేకపోతే.... కాసేపిలా..." అంటూ అతను గుక్కతిప్పుకునేలోగా అతని వొళ్ళోకి వాలిపోయింది ఆమె.

సూరిబాబుకింకా అయోమయంగా వుంది. పావుగంట క్రితం తను కెమిస్ట్రీ లెక్చర్ వింటూ బుర్ర వేడెక్కించుకున్నాను. ఇంతలో ఇలాంటి విచిత్రమైన అనుభవం కల్గుతుందని సరదాకయినా ఊహించలేదు. వాస్తవం ఊహలకన్నా ఎంతో గమ్మత్తుగా - మధురంగా వుంటుందని అతనికిప్పుడే అనుభవమయింది!

తను పొడగరి. బలంగా వుంటాడు. సినిమా హాల్సు వాళ్ళు అడ్డు చెప్పరు..... శుభ్రంగా ఏడాది నుంచి ఎడల్సు ఫిలిమ్సు మస్తుగా చూస్తున్నాడు. అందమయిన అమ్మాయిల అర్ధనగ్న చిత్రాలని కన్నులవిందు చేసుకుంటున్నాడు. అప్పుడప్పుడు ఫ్రెండు రవి తెచ్చే సెక్సు కథల పుస్తకాలు చదివి గమ్మత్తయినవి ఊహించుకుంటున్నాడు. రేపు అందబోయే రుచులెలా వుంటాయో నోరూరించుకుంటున్నాడు....

ఇంతవరకు అంతే!

కాని, ఇప్పుడు? కలలో కూడా కోరుకోని అనుభవం! సరాసరి తన ఒడిలో ఒక అందాలభామ! తనకంటే కాస్త పెద్దదయితేనేం - అన్ని అవయవాలు తీర్చిదిద్దుకుని మిసమిస లాడుతున్న పరువం. ఆమె మెత్తని వొళ్ళు టాక్సీ కుదుపులకి తన తొడని ఒత్తుకుంటే మత్తెక్కిపోతోందతనికి. విచిత్రమయిన బాధ. నరాలు జివ్వుమంటున్నాయి. వెచ్చని నెత్తురు జలజల పారుతోంది.

అప్రయత్నంగానే ఆమె చుట్టూ చేయివేసి దగ్గరగా పొదివి పట్టుకున్నాడు. ఆమె ఏమయినా అనుకుంటేందేమోనని కూడా అతను సందేహించలేదు..... టాక్సీ ఆగిపోతే ఆమె విడిపోతుంది. తనకు దూరమయిపోతుంది. దొరికిన ఈ క్షణాన్ని మధురం చేసుకోమని మనస్సు తొందర పెట్టింది. వయస్సు ముందుకు నెట్టింది. అతని ఒడిలో ఆమె సుందర తనూలతను అటూ ఇటూ కదుపుతూ అతని మురిపాన్ని తీరుస్తోంది టాక్సీ!

మరి కాసేపటికి గమ్యం చేరుకున్నారు.

"అదిగో! అదే మా ఇల్లు....." అంటూ రెండో అంతస్తు చూపించింది ఆమె.

ఆమె అడగవల్సిన అవసరం లేకపోయింది. అతనే ఆమె చేతిని పట్టుకుని మేడ మెట్లవైపు తీసుకెళ్ళాడు. తన బేగ్‌లోని తాళం చెవి తీసి అతనికిచ్చింది ఆమె.

"మీరొక్కరేనా?"

అవునంది ఆమె.

అతనికెంతో తియ్యగా హాయిగా ఒళ్ళు జల్లుమంది. తలుపులు తీసి ఆమెను లోపలి గదిలోకి తీసుకెళ్ళాడు. తలగడా సర్ది ఆమెను మంచం మీద పడుకోబెట్టాడు.

"నీకు చాలా శ్రమ ఇచ్చాను" అందికృతజ్ఞతగా.

"నో నో! నాటెటాల్."

"నువ్విలా అంటుంటే ఏమిటో గమ్మత్తుగా వుంటుంది"

అతనికీ నవ్వొచ్చింది.

"నీకేం తొందరలేకపోతే...."

ఆమె మరికాసేపు ఉండమంటోంది. అతనికి మహదానందమైంది.

"చెప్పండి. ఏం కావాలి?"

"తలుపులు గడియపెట్టేవా?"

కంగారు తల అడ్డంగా తిప్పాడు.

ఆమె చిన్నగా నవ్వింది. "పక్కింట్లో దొంగ పిల్లి. అది వస్తే పాలు తాగి పోతుందని...."

ఆమె అలా నవ్వటమే కాదు - అలాగనటమే అతనికెంతో మధురంగా వుంది. వెంటనే వెళ్ళి తలుపులు గడియపెట్టి వచ్చాడు.

"ఆ ఫ్లాస్కులో కాఫీ వుంది. కప్పులు అక్కడే వున్నాయి. ఇఫ్ యు డోన్ట్‌మైండ్...."

"ఫర్వాలేదండి" అని వెళ్ళి కప్పుల్లో కాఫీ పోసి తెచ్చాడు.

"అల్మారాలో బిస్కట్ల పేకెట్టుంది. కొంచెం తెస్తావా!"

అతను తెచ్చాడు. ఆమె రేపర్ని చించి బిస్కట్లు తీసుకోమంది. అతను మొహమాటంగా వద్దన్నాడు.

"ఓపికలేక.... లేకపోతే నేను టిఫిను చేసి పెట్టేదాన్ని."

"అబ్బే. ఆకలిగా లేదండి."

"నాకోసం అంతదూరం నుంచి శ్రమపడి వచ్చావు. ప్లీజ్! నా కోసం....తీసుకో!"

ఆమె అలాగనటం అతనికెంతో థ్రిల్లింగ్‌గా వుంది. రెండు బిస్కట్లు తీసుకుంటూ "మీరు...." అని అడగబోయి ఆగిపోయాడతను.

"నేనెవర్నని అడగాలనుకుంటున్నావు కదూ!...."అని మందహాసం చేసి, "నా పేరు మనోరమ. ఒకళ్ళిద్దరు స్నేహితులు తప్ప దగ్గరి బంధువులెవరూ లేరు. గడపటానికి ఓ ఉద్యోగం వుంది. కెనరా బ్యాంకులో పనిచేస్తున్నా. నా గురించి తెల్సుకోవటానికింకేమీ లేదు" అంది ఆమె.

అతనికి మనస్సు చివుక్కుమంది. "సారీ!"

ఆమె పల్చగా నవ్వింది. "నీలాంటి మంచివాళ్ళెవరో పరిచయమయినప్పుడు.... కాసేపు సరదాగా గడుపుతాను. మనస్సుకి హాయిగా వుంటుంది. అంతే!"

అతనికామె మీద ఎంతో జాలి కలిగింది.

"సారీ! చదువుకొనేవాడివి. నీ టైము వేస్టు చేస్తున్నా."

"నో నో! నాటెటాల్."

ముసిముసిగా నవ్వింది ఆమె. అర్థమయి అతను సిగ్గుపడిపోయాడు.

• • •

ఆ మర్నాడు సరాసరి కాలేజీ నుంచి మనోరమ ఇంటికి వచ్చాడు సూరిబాబు. తలుపు తీస్తూ "వచ్చావా! నువ్వు తప్పకుండా వస్తావని నాకనిపించింది" అని చిరునవ్వు నవ్వింది ఆమె. అతన్ని కూర్చోబెట్టి ఎదురుగా తనూ కూర్చుంది.

"మీ వొంట్లో ఇప్పుడెలా వుంది?"

"రాత్రి ఓ పెద్దడోకు వెళ్ళింది."

"అరే!"

"అసలా డోకు వెళ్ళిపోయాకనే నాకు ప్రాణానికి హాయి అనిపించింది."

ఆమెవైపు కన్నార్పకుండా చూసాడు. పాలపిట్ట రంగు చీరలో మనోరమ నిజంగా మనోహరంగా కనిపిస్తోంది. క్రితంరోజు తను చూడని అందాలెన్నో విరజిమ్ముతోంది. 'అబ్బ, ఎంత అందగత్తె!' అని అనుకోకుండా ఉండలేకపోయాడు.

"ఏమిటలా చూస్తున్నావు?" అంది గోముగా.

కంగారు నవ్వి, "ఇంకా నీర్సంగా కనిపిస్తుంటేను" అని నసిగాడు.

"నిన్ను చూసేసరికి ఆ నీరసం కూడా ఎగిరిపోయింది" అంటూ వంటింట్లోకి వెళ్ళి స్వీటు తెచ్చి పెట్టింది.

"అబ్బే, ఎందుకండీ!" అన్నాడు మొహమాటంగా.

"నిన్ననేమీ పెట్టలేకపోయా. ఇవేళ నువ్వొస్తావనిపించి చేసా. నువ్వు తినకపోతే నాకు బావుండదు"

ఆమె మాటల్ని కాదనే శక్తి అతనికి లేకపోయింది.

"గుడ్‌బోయ్!" అని నవ్వింది.

అతని ముఖం ఎరుపెక్కింది.

"మీ నాన్నగారేం చేస్తుంటారు?"

చెప్పాడు. అతని తల్లిగురించి, అన్నదమ్ముల గురించి, అప్పచెల్లెళ్ళ గురించి అడిగింది. అన్నీ చెప్పాడు.

"అదృష్టవంతుడివి. నీకందరూ ఉన్నారు" అంది నిండుగా.

అతను చిత్రంగా చూసాడు.

"లడ్డూలు ఎలా వున్నాయి?"

'మీ మాటలు ఎక్కువ తియ్యగా వున్నాయో, మీ లడ్డూలు ఎక్కువ తియ్యగా వున్నాయో చెప్పడం కష్టం!' అని అందామనుకున్నాడు. కాని, ఏదో జంకు. "బావున్నాయి" అన్నాడు.

కారప్పూస తెచ్చి పెట్టింది.

"మీరు నా గురించి చాలా శ్రమపడుతున్నారు."

"శ్రమా! నువ్వంత దూరంనుంచి నన్ను చూడ్డానికి వచ్చిందానికన్నానా?"

కాఫీ త్రాగాక.... మరి కాసిని కబుర్లు అయ్యాక లేవలేక లేవలేక లేచి "వస్తానండీ!" అన్నాడు.

"నీకు వీలున్నప్పుడు వస్తూండు."

• • •

ఆ ఇంటికి వీలుచేసుకుని మరీ వస్తున్నాడు సూరిబాబు. అతనలా రావటం ఆమెకు అభ్యంతరం లేదు సరికదా అతనికోసం ఎదురుచూస్తున్నదానిలా కనిపించేది. 'బెల్లు మ్రోగితే నువ్వే అనుకున్నా' అనేది ఓసారి. 'నువ్వొస్తావనుకునే బజారుకి వెళ్ళాల్సినదాన్ని వెళ్ళలేదు' అనేది ఇంకోసారి. 'ఇంకా రాలేదేమిటా అని చూస్తున్నా' అనేది మరోసారి.

ఆమె కబుర్లు వింటుంటే ఎంతో పరవశంగా వుంటుంది. ఆమెతో మాట్లాడకుంటే అంతుపట్టని ఆవేశమేదో నిలువునా ఊగించేస్తుంది. ఒక్కోరోజు గడుస్తుంటే ఆమె తన కొక్కో అడుగు దగ్గరవుతున్నట్లనిపిస్తోంది సూరిబాబుకి.

ఏదో ఒకరోజున...

మనోరమ తన చేయిపట్టుకుని దగ్గరగా లాక్కుంటుంది. తన చుట్టూ చేతులు వేసి

తనని - తన గుండెలకదుముకుంటుంది. తనని ముద్దులతో ముంచెత్తిస్తుంది.

అప్పుడు తనేం చేయాలి! ఏం చేస్తాడు?

తన సర్వస్వం మరచి ఆమెలో కరిగిపోతాడు. ఆమెను చుట్టుకుపోతాడు. ఆ అందాల్ని తనివితీరా తన స్వంతం చేసుకుంటాడు.

ఆరోజు.... తనకెంతో దగ్గరగా వుందని అతని నమ్మకం. అందుకే. ఆ అవకాశం ఏమాత్రం పోగొట్టుకోకూడదని అతను దాదాపు రోజూ మనోరమ ఇంటికి వస్తున్నాడు.

ఆమెతో విడదీయలేని అనుబంధం ఏదో ఏర్పడిందని అతను ఎవ్వరితోనూ చెప్పలేదు - ఇంట్లోనే కాదు, చివరికి తన క్లోజ్ ఫ్రెండ్ రవితో కూడా చెప్పలేదు.

ఆవేళ అతను బెల్లు మ్రోగించవల్సిన అవసరం లేకపోయింది. తలుపులు తెరుచుకునే వున్నాయి. ఇంకా అతను డోర్ కర్టెన్ తెరచుకుని లోపలికి అడుగుపెట్టలేదు.

"రా సూరిబాబూ!" అన్న ఆమె గొంతు వినపడింది.

లోపలికి వచ్చి అతనాశ్చర్యంగా చూసాడు.

"నీ అడుగుల చప్పుడు నాకు గుర్తే!" అని ఆమె నవ్వింది.

అబ్బ, నిత్యం చూస్తున్నా.... ఆమె నవ్వు ఎంత కొత్త కొత్తగా వుంటుంది! ఎంత మధురాతి మధురంగా వుంటుంది! మనోరమ నిజంగా మనోరమ!.... అని అనుకోకుండా ఉండలేకపోయాడతను.

"ఇలారా! ఇలా నిలబడు" అంటూ అతన్ని తన చేతుల్తో పట్టుకుని నిలబెట్టి మెజరింగ్ టేప్‌తో చేతులు, చెస్టు కొలిచింది.

"ఎందుకూ?" అన్నాడతను చిత్రంగా చూస్తూ.

"ఊహూ! చెప్పను. చాలా సీక్రెట్!" అని ముసిముసిగా నవ్వింది.

"అబ్బ, చెప్పండీ!"

"చెప్పేస్తా కాని..... నేనిచ్చేది కాదనకూడదు."

"సరే!" అన్నాడు కుతూహలంతో వేగిపోతూ.

"ఏం లేదు. ఈ మధ్యనే స్వెట్టరల్లటం నేర్చుకున్నా...." అని నవ్వి సంచీ ఒకటి తెచ్చి ఊలు బయటకు తీసి "రంగు బావుందా?" అంది.

"బావుంది కాని, సీక్రెట్ ఏమిటో చెప్పలేదు."

"అదే, నీకు స్వెట్టరు అల్లుదామని."

అతను చకితుడయ్యాడు. "నాకా?"

"అవును."

"ఎందుకండీ మీ కింత శ్రమ!"

"జీవితంలో అందర్కీ అన్నీ చెయ్యాలనిపించదు సూరిబాబూ! కొందరికోసం ఎన్నయినా చేయాలనిపిస్తుంది" అంది అతనివైపు లాలనగా చూస్తూ.

'మీలా తియ్యగా మాట్లాడ్డం కూడా అందర్కీ చేతకాదు.' అని అందామనుకున్నాడు. ఎలాగనాలో తెలియక కళ్ళప్పగించి చూస్తుండిపోయాడు.

గబుక్కున అతనికి దగ్గరగా వచ్చింది. అతని బుగ్గమీద చిట్టి దెబ్బ వేసి మూతి ముచ్చటగా తిప్పింది. "అసలే మొదటిసారి అల్లటం. తర్వాత సరిపోకపోతే.... ఒకసారి లేచి నిలబడు. మరోసారి కొలతలు తీసుకోనీ!"

ఆమె చేతివ్రేళ్ళు ఒంటికి తగిలేసరికి అతని నరాలు జివ్వుమనసాగాయి. ఏదో అర్థంకాని అనుభూతి. అంతుపట్టని ఆవేదన. ఒళ్ళంతా వేడెక్కిపోయినట్టయింది. ఆమె వెచ్చని వూపిరి తనకు తగులుతున్నంత దగ్గరగా ఆమె.... అతనికి గుండెలు దడదడలాడాయి.

అతని మెడ కొలత తీసుకోటానికి మునివేళ్ళ మీద లేచింది. తూలి అతనిమీద పడ బోయింది. గబుక్కున ఆమెను పొదివి పట్టుకున్నాడు సూరిబాబు. ఆ విసురులో ఆమెను గట్టిగా కౌగిలించుకుని ఆమె ముఖం మీద ముద్దుల వర్షం కురిపించాలని అతని అణువణువు తొందరపెట్టింది. ఏదో భయంపట్టి ఆపివుండకపోతే అంతపనీ చేసి వుండేవాడతను.

"అబ్బ, మరీ పొడుగు. కాస్త మెడ వంచకూడదేమిటీ!" అంది గోముగా.

అతను మెడవంచాడు. ఆమె కొలతలు తీసుకుంది.

"గుడ్ బోయ్!" అని మందహాసం చేసింది.

చన్నీళ్ళు ముఖం మీద చల్లినట్లనిపించింది. స్పృహ కలిగింది. ఒళ్ళు తెలిసింది.

"వెళ్ళొస్తానండీ!" అన్నాడు కంగారుగా లేస్తూ.

● ● ●

ఆవేళ అతను రాగానే "వేసుకుని చూడు. ఎడ్జస్టుమెంట్సు ఏమయినా అవసరమయితే చేస్తా" అంది మనోరమ స్వెట్టరు చేతికందిస్తూ.

సూరిబాబు స్వెట్టరు తొడుక్కున్నాడు. తనే అతని చుట్టూ తిరుగుతూ ముడతలు సరిచేసింది ఆమె. "ఎలా వుందో చూసుకో!" అని అద్దం తెచ్చి చూపింది.

అతను చూసుకున్నాడు.

"ఎలా వుంది?" అని ఉత్సాహంగా అడిగింది.

"అబద్ధాలాడకండి."

ఆమె చిత్రంగా చూసింది. "అబద్ధమా?"

"రెడీమేడ్‌ది కొనుక్కొచ్చి.... అట్లా అంటారేమిటి?" అని ఓ క్షణం ఆగి గలగల నవ్వాడు.

"అబ్బ, హడలకొట్టి చంపావు కదా!" అంటూ అతని చెంప మీద చిట్టి దెబ్బ కొట్టింది.

"ఇంత త్వరగా అల్లేసారు. ఇంక అన్ని పనులు దీనికోసం మానేసారా?"

"అప్పుడే చలిగాలి తిరిగింది. నాకోసం ఇంత దూరం వస్తున్నావు. మరి తొందరపడి అల్లద్దూ!"

ఏదో అనబోయి ఆగిపోయాడు.

"ఆగిపోయావేం?"

"మీరు నామీద ఇంత అభిమానం చూపిస్తున్నారు! నాకేం చేయాలో... తెలీటం లేదు."

"నువ్వు ఏం చేస్తున్నావో నీకే తెలియదు" ఆమె కళ్ళు తళుక్కుమంటున్నాయి.

"నేనేం చేసాను? నేను మీకేమీ ఇవ్వలేదు. మీ బర్త్‌డే ఎప్పుడు?" అన్నాడు అధాత్తుగా.

ఆమె నవ్వింది. "దేనికి?"

"మీకేదయినా..."

"ప్రజంటు చేద్దామనా? నువ్వు బాగా చదువుకుని పెద్ద ఉద్యోగస్తుడివయినాక.... అప్పుడు! అప్పుడు ప్రజంటు చేద్దుగాని. అంతవరకు నువ్విస్తున్నది చాలునాకు."

"నేనిచ్చానా? ఏమిచ్చాను?" అన్నాడు తెల్లబోతూ.

అతని చెంపమీద చిట్టిదెబ్బ వేసి పరిహాసంగా నవ్వింది. "నువ్విస్తున్నదేమిటో నీకు తెలియదు. అందుకే నువ్వంటే నాకిష్టం!"

ఎందుకలా అంది? 'ఇంకా గ్రహించుకోలేవా పిచ్చివాడా! ఇంతగా మనస్సు విప్పి చెపుతున్నానే – ఇంకా అర్థం కాలేదా?' అని ఆమె మాటల కర్థమా!

తనిప్పుడేం చేయాలి?

• • •

"నాకేం చేయాలో తోచటం లేదురా!" అన్నాడు సూరిబాబు.

"ఇన్నాళ్ళూ నాకీ సంగతి ఎందుకు చెప్పలేదురా ఫూల్!" అన్నాడు రవి.

"ఇప్పుడు చెప్పానుగా.... ఇక నేనేం చేయాలో చెప్పు... నిజంగా ఆమె నన్ను ప్రేమిస్తోందం టావా?"

"ఇంకా అనుమానం దేనికి? ఈ స్వెట్టరు చెప్పటం లేదూ!"

"మరి నీకేం తెలీదు.... అంటుందేమిటి?"

సూరిబాబు బుంగమూతి చూసి రవి నవ్వాడు. "నీకన్నా పెద్దదే కావచ్చు. ఎంతయినా ఆడది. తనెలా చెపుతుంది! మగవాడివి నువ్వే ముందడుగు వెయ్యాలి.'

"అంటే!"

"ఆమె నీకు దగ్గరగా వచ్చి కూర్చున్నప్పుడు.... ఆ చెయ్యి పట్టుకుని నెమ్మదిగా ముద్దెట్టుకో! నువ్వో అడుగు ముందుకేస్తే.... ఆమె మరో అడుగు ముందుకొస్తుంది. అప్పుడు...."

"ఊహూ! చాచిపుచ్చుకుని లెంపకాయ గొడితే!...."

"కొట్టేదయితే నిన్నింత దగ్గరగా రానిస్తుందా?"

"ఆమె మనసులో నిజంగా ఆ ఉద్దేశ్యమే వుంటే...."

"ఓ పన్జేయి. ఓ ప్రేమలేఖ రాయి."

"అబ్బ, ఏదో భయంగా వుందిరా!"

"పోనీ, నీతోపాటు రేపు నన్ను తీసుకువెళ్ళు. ఓసారి ఆమెను చూసాక ఏం చేయాలో

చెపుతా."

సూరిబాబు ముఖం వికసించింది.

ఆ మర్నాడు రవిని తీసుకుని మనోరమ ఇంటికి వెళ్ళాడు సూరిబాబు.

పరిచయాలయ్యాక.... ఫలహారాలయ్యాక.... బోల్డన్ని కబుర్లు కలబోసుకున్నాక "నీకింత మంచి ఫ్రెండు వున్నాడని నాకెప్పుడూ చెప్పలేదేం?" అంది మనోరమ నవ్వుతూ.

"నేను మీరనుకున్నంత మంచివాడ్ని కాదండీ!" అన్నాడు రవి కొంటెగా.

మనోరమ అదేమీ గుర్తించినట్టు లేదు. "సూరిబాబు ఫ్రెండువయ్యాక చెడ్డవాడివి కావాలన్నా కాలేవు!"

ఆమె కళ్ళలోని ప్రేమ సూరిబాబుని నిలువెల్లా ముంచెత్తించింది. ఆమెవైపు ఆరాధనగా చూసాడతను.

"అయితే, నేనిక్కడకు రావటం మీ కభ్యంతరం లేదన్నమాట!" అన్నాడు రవి పరిహాసంగా.

"నీకెందుకా సందేహం వచ్చింది!" అంది మనోరమ చిత్రంగా చూస్తూ.

"అబ్బే, ఊరికే అన్నాను."

"ప్రేమించేవాళ్ళను పర్మిషన్ అడిగి ప్రేమించరు. అభిమానించే చోటికి ఎవరూ అడిగి రారు. నువ్వింకా చిన్నవాడివి. నువ్వు తెలుసుకోవల్సినవి చాలా వున్నాయి!" అంది ఆమె.

ఆ తర్వాత కుర్రవాళ్ళిద్దర్కీ మాటలు దొరకలేదు.

"పొద్దుపోయింది." మీరిక ఇళ్ళకు వెళ్ళే వేళయింద'ని ఆమే వాళ్ళకి గుర్తు చేయాల్సి వచ్చింది.

రోడ్డు మీదకి వచ్చాక రవి భుజం మీద చేయి వేసి, "ఇప్పుడేం చేయమంటావురా?" అని అడిగాడు సూరిబాబు.

"వండర్‌ఫుల్ ఉమన్!"

"అద్సరేరా! ఆమె మాటల కర్థం ఏమిటి?"

"ఐసే- యు ఆర్ ఎ లక్కీ ఫెలో! నీ రొట్టి విరిగి నేతిలో పడిందనుకో!.... ప్రేమించే వాళ్ళని పర్మిషన్ అడిగి ప్రేమించరు - అంది. ఇంకా ముందడుగు వెయ్యకుండా మీన మేషాలు లెక్కపెడతావేంటిరా వెర్రినాగన్నా - అని అర్థం!"

"అంటే, ఇప్పుడు నన్నేం చేయమంటావు?"

"రేపు వెళ్ళగానే అమాంతం కావలించుకుని ముద్దెట్టుకో! అడ్డు పెట్టలేదంటే... ఇంకా పైన నీ ఇష్టం వచ్చినట్లు విజృంభించు!"

"ముద్దెట్టుకోకముందే మూతిపళ్ళు రాలకొడితే?"

"ఒట్టి దద్దమ్మవిరా! నిన్నింతగా ప్రేమిస్తున్నది - నిన్నెందుకు కొడుతుంది? నా కళ్ళతో నేను చూసాను... నువ్వంటే ఆమె పడి చస్తోంది. ఇందులో సందేహం ఏమాత్రం లేదు."

"ఏమోరా! నాకు చచ్చేంత భయంగా వుంది."

"పోనీ, ఓ లవ్ లెటర్ రాసిచ్చి వచ్చేయి. మర్నాడు వెడితే ఏ సంగతీ తెల్సిపోతుంది."

"అంతేనంటావా?"

"అంతే!"

• • •

రెండు రోజులు పోయాక ఏంరా? లవ్ లెటరు రాసిచ్చి వచ్చావా?" అని అడిగాడు రవి.

తల అడ్డంగా తిప్పాడు సూరిబాబు.

"నాకు తెల్సు, నువ్వొట్టి పిరికివాడివని. అందుకే నేనే ఆ పని చేసొచ్చానీవేళ" అన్నాడు రవి నవ్వుతూ.

సూరిబాబు గతుక్కుమన్నాడు. "నువ్వు.... నువ్వు ప్రేమలేఖ వ్రాసావా?"

"అవును."

సూరిబాబు ముఖం ఎర్రనయింది.

"స్కౌండ్రల్!"

"కంగారుపడకు. నీకు దొరికిన పిట్టని నేను పట్టుకుపోనులే!"

"యూ రాస్కెల్! ఆమె గురించి అంత చీప్‌గా మాట్లాడకురా!"

"అబ్బో, తన సొంతమయితే ఎంత కోపం! మరంత ప్రేమయితే ఆ లెటరేదో నువ్వే వ్రాయకపోయావా?"

"రాసేవాణ్ణో కాదో! తొందరపడి నువ్వెందుకు రాయటం!"

"ఒరే దద్దమ్మా! నేను రాసింది నేను లవ్వాడుతున్నానని కాదు. నువ్వు ప్రేమించి తలక్రిందు లయిపోతున్నావని!"

"నువ్వు లెటరు ఇవ్వగానే అదేమిటని అడగలేదూ!"

"అడిగింది. అది చదివి సూరిబాబుకి జవాబివ్వండి.... అని చెప్పేసి పరిగెత్తుకొచ్చేసా!" అని నవ్వాడు రవి.

"మరి.... మరి నేనిప్పుడేం చేయాలి?" అన్నాడు సూరిబాబు తనలో తను గొణుక్కుంటూ.

"నీకేం తెలీనట్టు మామూలుగా వెళ్ళు."

• • •

ఆ మర్నాడు సాయంత్రం మనోరమ ఇంటికి వెళ్ళాడు సూరిబాబు. ఎర్రబడిన ఆమె ముఖం చూసాక అతను మామూలుగా ఉండలేకపోయాడు.

"ఏం అలాగున్నావేం?" అని నెమ్మదిగా అడిగింది ఆమె.

"ఏం లేదండి. బాగానే వున్నాను" అన్నాడు బలవంతంగా నవ్వుతూ.

ఓక్షణం ఆగి, "రెండు రోజుల్నుంచి రాలేదేం?" అని అడిగింది.

"నోట్సు ప్రిపేరు చేసుకున్నా."

"ఏం నోట్సు?"

"కెమిస్ట్రీ.... కాదు కాదు ఫిజిక్సు!"

"అబద్ధాలాడటం ఎంత కష్టమో చూసావా?"

"లేదండీ! నిజం!"

"రవి కనిపించాడా?"

తలవూపాడు. "ఏం చెప్పాడు?"

"నిజం చెప్పేవాళ్ళు తడబడరు. ధైర్యంగా తలెత్తుకు మాట్లాడతారు."

కంగారుగా తలెత్తాడు. "వాడు నాకు చెప్పకుండానే మీకు లెటరు ఇచ్చాడు."

"లెటరు ఇచ్చానని చెప్పి జవాబు తెచ్చుకోమని చెప్పాడా ఇప్పుడు!"

సూరిబాబు అవాక్కయిపోయాడు.

"జవాబు కావాలా?"

అప్పటికీ అతని గొంతు పెగల్లేదు.

"జవాబు రాసి సిద్ధంగానే ఉంచాను." అంటూ తలగడ క్రిందనున్న కాగితం మడతని అతనికందించింది. "వెళ్ళు... వెళ్ళి చదువుకో!"

ఆమె గద్గదస్వరం విని చకితుడయ్యాడు. ఎంత అతను చూడకూడదని తల తిప్పుకున్నా ఆమె కన్నీటి తెరని అతను చూడనే చూశాడు.

"ఏమండీ! నా ఉద్దేశం...."

"..... మీ ఉద్దేశమేమిటో నాకు తెల్సింది. నా ఉద్దేశమేమిటో అది చదివితే నీకూ, రవికీ బాగా అర్థమవుతుంది. వెళ్ళు బాబూ! వెళ్ళి చదువుకో! చదివి ఆలోచించుకో!...."

● ● ●

పార్కులో సంజ చీకట్లు ఆవరించుకున్నాయి.

ఎవరూ లేనిచోటికి పోయి ఆ మసక చీకట్లోనే ఆ కాగితం మడతను విప్పాడు సూరిబాబు. అతని చేతులు వణుకుతున్నాయి. గుండెలు దడదడలాడుతున్నాయి. నిలబడలేక నేలమీద కూలబడి గబగబా చదవసాగాడు.

బాబూ!

నాకు అయినవాళ్ళెవరూ లేరు. అడుగుపెట్టిన చోటల్లా అపజయాల పాలవుతూ అనుక్షణం ఆవేదనతో బ్రతికే బ్రతుకు నాది. మనసారా ప్రేమించే వాళ్ళ కోసం మొహం వాచిపోయి ఒంటరిగా బ్రతుకుతున్న నాకు మూడు నెలలక్రితం దేవుడు నీ రూపంలో ఓ వరం ప్రసాదించాడనుకున్నాను. నా అంతటి అదృష్టవంతురాలు మరెవరూ లేరనుకున్నాను.

నీకు అమ్మ, నాన్న, అన్నా, తమ్ముడూ, అక్కా, చెల్లెలు అంతా వున్నారు. అందరిలో వున్నవాడివి. ప్రేమని పంచి ఇవ్వటం నీకు తెల్సని నీ మీద వెర్రి ఆశ పెట్టుకున్నాను. నువ్వు చూపించిన అనురాగానికి మురిసిపోయి ఎన్నెన్నో వూహించుకున్నాను. కాని, నీ అభిమానానికి మరో రూపం వుందని రవి అంటున్నాడు! నిజమా అది! నువ్వు రాద్దామని రాయలేకపోయినవి

తను రాసానని అంటున్నాడు! నిజమా అది?

మూడు నెలలు నీకెంతో దగ్గరగా గడిపాను. ఓ అక్క తన తమ్ముడ్ని ఎలా ముద్దు చేస్తుందో నాకు తెలీదు. దురదృష్టవంతురాల్ని. నేనా భాగ్యానికి పెట్టి పుట్టలేదు. నిన్ను ముట్టుకున్నప్పుడు చిన్నవాడ్ని తమ్ముడ్ని ఓ అక్క ముట్టుకున్న భావనేకాని నువ్వు వయసొచ్చిన వాడివన్న ఆలోచన రాలేదు నాకు.

ఎన్నోసార్లు నువ్వు నన్ను ముట్టుకున్నావు. నువ్వు చలించలేదు. ఇంత నిగ్రహం వున్న నీ గురించి రవి ఎంత ఘోరంగా వ్రాసాడు! నీ మాటలో చూపులో స్పర్శలో నేను చవి చూసింది వాత్సల్యం కాదని కాంక్ష అని రవి అంటుంటే ఎలా నమ్మమంటావు బాబూ! ఇన్నాళ్ళు కేవలం ఓ ఆడదానిగానే నన్ను చూసావని...ఓ నిర్భాగ్యపుటక్క మీద తమ్ముడు చూపించిన ఆదరణ కాదని, ఎలా అనుకోగలను! ఎడల్టు ఫిలిమ్సు చూస్తాడని, సెక్సు పుస్తకాలు చదువుతాడని రవి రాసిన ఉత్తరం విప్పి చెప్పింది నాకు. నీలో కలిగిన భ్రమలేవయినా వుంటే వాటిని తొలగించడం పోయి నిన్ను తప్పు దోవ పట్టించబోతున్నాడని కూడా అర్థమవుతోంది నాకు.

ఇది సహజంగా నీలో పుట్టిన బుద్ధంటే నేను నమ్మను. రవి నిన్ను పాడుచేస్తున్నాడనీ నేను అనలేను. మీ చుట్టూ వున్న వాతావరణం అటువంటిది. మీరు చూస్తున్న సినిమాలు మంచివి కావు. మీరు చదువుతున్న బూతు పుస్తకాలనుండి మీరు నేర్చుకోవల్సినది ఏమీ లేవు. ఒంటరిగా వున్న ఆడవాళ్ళంతా కాముకులని మగవాళ్ళకోసం పడిచచ్చిపోతున్నారని పచ్చి పచ్చిగా చెపుతాయి తప్ప మీకో బాధ్యత, మీలో సంస్కారమూ కలిగించవు. మీ లేత మనస్సుల్లో లేనిపోని భ్రమలు కల్పించి తప్పుదారి పట్టిస్తాయి. వివేకహీనుల్ని చేస్తాయి. మంచి, చెడూ తెల్సుకునే ఇంగితజ్ఞానాన్ని లేకుండా చేస్తాయి. చదువుకుని పైకి రావల్సిన వాడివి. నీ ఉజ్జ్వల భవిష్యత్తు కోసం మీ వాళ్ళు నీ మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఇప్పుడు దారి తప్పితే తర్వాత నువ్వే బాధపడతావు.

నీలో కలిగిన చపలత్వానికి నేనెంతవరకు బాధ్యురాలినో నాకు తెలియదు. తెలిసో తెలియకో నేను హద్దులు దాటివుంటే ఈ దౌర్భాగ్యపు అక్కని క్షమించు తమ్ముడూ! మళ్ళీ ఇలాంటి పొరపాటు జరక్కుండా చూసుకుంటాను. నేనెక్కడకైనా దూరంగా వెళ్ళిపోతాను. నా నీడ నీమీద పడనంత దూరంగా వెళ్ళిపోతాను. నా జీవితం ఎలా పోయినా ఫర్వాలేదు. ఒంటరిగా బ్రతకడం నాకు కొత్త కాదు. మూడు నెలలపాటు ఓ తమ్ముడు చూపించిన అభిమానాన్ని జీవితాంతం గుర్తుకు తెచ్చుకుంటూ బ్రతగ్గలను!

నువ్వు మాత్రం బాగా చదువుకొని గొప్ప ఉద్యోగం తెచ్చుకుని అందరిచేత శభాషని పించుకో! ఎక్కడవున్నా ఈ అక్క ఆశీస్సులు నీకు ఎప్పుడూ వుంటాయి. శలవ్.

–మనోరమ.

●